

హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో పర్యటిస్తున్న కలెక్టర్

నష్టంపై ప్రాథమిక నివేదిక అందించాలి : కలెక్టర్

సిద్దిపేట అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం, సహాయక చర్యలు, ఇతర నష్టాలను త్వరగా అంచనా వేసి ప్రాథమిక నివేదకను ప్రభుత్వానికి అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సీపీ విజయ్‌కుమార్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా ఎవరు సెలవుపై వెళ్లకూడదని హెచ్చరించారు. వర్షాలు, సంబంధిత సమాచారానికై కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08457-230000ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లను అందించాలని చెప్పారు. అనంతరం సీపీ మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీస్ సిబ్బందిని ఆదేశించడం జరిగిందని ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సంగారెడ్డి నియోజకవర్గంలో 18 వేల సంతకాల సేకరణ

రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే పిలుపుమేరకు ఓట్ చోరీకి వ్యతిరేకంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు..

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
సంతకాల సేకరణకు అపూర్వ స్పందన

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా దేశవ్యాప్తంగా ఏఐసీసీ చేపట్టిన ఓట్ చోరీ సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో భాగంగా సంగారెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పరిధిలో 89 గ్రామ పంచాయతీలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలోని 64 వార్డుల్లో 18వేల మంది క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. దీనిపై జగ్గారెడ్డి నేతృత్వంలో సంగారెడ్డిలో ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు



గాంధీభవన్‌కు పంపనున్న సంతకాల పత్రాలతో జగ్గారెడ్డి తదితరులు

జార్జ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడు బుచ్చిరాములు, కొండాపూర్ మండల అధ్యక్షుడు, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మండల అధ్యక్షుడు సిద్దన్న, సదాశివపేట పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు రామచందర్ నాయక్, కుమార్, నాయకులు కూన సంతోష్, కిరణ్, నర్సింహారెడ్డి, ఆశిరెడ్డి, గుండు రవి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 89 గ్రామాలు, సదాశివపేట, సంగారెడ్డి మున్సిపాలిటీల్లోని 64వార్డుల్లో ఓట్ చోరీ సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించామని తెలిపారు. దొంగ ఓట్లను తయారుచేసి వాటి ద్వారా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తోందని విమర్శించారు. ఒక రాష్ట్రంలో ఉన్న ఓట్లను మరో రాష్ట్రంలోకి.. ఒక జిల్లాలో ఉన్న ఓట్లు మరో జిల్లా లోకి మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. బీజేపీ దొంగ ఓట్ల ప్రక్రియను రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో నిరూపించినా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీతో లోపాయకారి ఒప్పందంలో భాగంగానే ఓట్ చోరీ జరుగుతోందన్నారు. ఇదే విషయంపై రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో ఎన్నోసార్లు ప్రస్తావించారన్నారు. సంతకాలు సేకరించిన పత్రాలను గాంధీభవన్‌లో అందజేస్తామన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే

- హెలిప్యాడ్‌ను పరిశీలించిన సీపీ

హుస్నాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హుస్నాబాద్‌లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. గురువారం సీపీ విజయ్‌కుమార్ హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో హెలిప్యాడ్‌ను పరిశీలించారు. హుస్నాబాద్‌లో నష్టాన్ని పరిశీలించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎంను కోరారు. ఈ మేరకు ఆయన హుస్నాబాద్‌కు వచ్చే అవకాశాలున్న దృష్ట్యా హెలిప్యాడ్‌తో పాటు భద్రతను పరిశీలించారు. ముందుగా సీపీ మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. హుస్నాబాద్ పోలీస్ స్టేషన్, పోలీసు క్వార్టర్స్‌ను సందర్శించారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ అడిమున్ కుశాల్కర్, ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, కిరణ్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తదితరులున్నారు.



మందపల్లి ఐకేపీ కేంద్రంలో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఏరుతున్న ఓ రైతు కుటుంబం

ముంచిన మొంథా

జిల్లాను మొంథా తుఫాను అతలాకుతలం చేసింది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను బుధవారం కురిసిన భారీ వర్షం బుగ్గిపాలు చేసింది. కోతకు సిద్ధమైన వరి నేలకొరిగి, పత్తి చేలు నీటమునిగి, చేతికందిన ధాన్యం మొలకెత్తడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. అక్కన్నపేట మండలం వద్ద వాగు దాటుతుండగా భార్యభర్తలు గల్లంతయ్యారు. రోడ్లు కోతకు గురై, ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఊపిరాడక పాడిగేదెలు మృతిచెందాయి. వరద బీభత్సంతో జిల్లాలో నష్టం వాటిల్లింది.

- సిద్దిపేట అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)

- భారీ వర్షం.. తీరని నష్టం
- యార్డుల్లో మొలకెత్తిన ధాన్యం
- నేలకొరిగిన వరి, మునిగిన పత్తి చేను
- ఇంకా వరద నీటిలోనే ధాన్యం కుప్పలు
- అక్కన్నపేట మండలంలో వాగు దాటుతుండగా ఇద్దరు గల్లంతు
- వరద నీటికి ఊపిరాడక గేదెలు మృతి

భారీ వర్షాల కారణంగా సిద్దిపేట జిల్లాలో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. బుధవారం రోజంతా కురిసిన అతి భారీ వర్షం కారణంగా, మొంథా తుఫాను అన్నదాతల ఆశలను నీరుగార్చింది. యార్డులు, ఐకేపీ కేంద్రాలకు తరలించిన ధాన్యం రోజుల తరబడి కురుస్తున్న వర్షానికి తడిసి మొలకెత్తింది. పలు ధాన్యం కుప్పలు ఇంకా వరద నీటిలోనే ఉండటంతో, కుటుంబ సభ్యులంతా కలిసి

మిగతా 8వ పేజీలో



వరదలో భార్యాభర్త గల్లంతు

అక్కన్నపేట మండలం మోత్కులపల్లె వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో బైక్‌పై దాటుతుండగా ఇసంపల్లి ప్రణయ్, కల్పన అనే భార్యభర్తలు గల్లంతయ్యారు. భీమదేవరపల్లి మండల కేంద్రం నుండి అత్తగారి ఇల్లు అయినా అక్కన్నపేటకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఉదయాన్నే చెరువు సమీపంలో బైక్ కనబడటంతో, బండి నంబర్ ఆధారంగా విషయం తెలిసింది. గల్లంతైన ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించి, గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

పరిశీలించిన మంత్రి పొన్నం

మోత్కులపల్లె వాగు వద్ద భార్యాభర్తలు గల్లంతయిన ప్రాంతాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించి మాట్లాడారు. కలెక్టర్, సీపీ అక్కడే ఉండి మానిటర్ చేయాలని ఆదేశించారు. ఎన్‌డీఆఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో ఆపరేషన్ ముమ్మరం చేసినట్లు చెప్పారు. బాధితుల కుటుంబాలను ఓదార్చారు. కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చి అక్కడి నుంచి వారిని ఇంటికి పంపారు.

హార్వెస్టర్ అద్దెలకు రెక్కలు

తొగుట : మొంథా తుఫాన్ నేపథ్యంలో టూవీల్ హార్వెస్టర్ గంటకు అద్దె రూ 2 వేలు, ఫోర్‌వీల్ హార్వెస్టర్ రూ.3 వేలు, బెల్టుమిషన్ అయితే గంటకు రూ.3,500 వరకు తీసుకుంటున్నారు. వర్షాలు పడటం ఎకరా పంట కోయడానికి 1:30 నిమిషాల నుంచి 2 గంటల వరకు పడుతుంది. సగటున రైతు ఎకరా పంట కోతకు రూ.6 వేల వరకు ఖర్చువుతుంది.



నేలకొరిగిన వరి పంట



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



ధూళిమిట్ట: ఊపిరాడగా చనిపోయిన గేదే

హుస్నాబాద్ అతలాకుతలం

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్/కోహెడ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా హుస్నాబాద్ అతలాకుతలమైంది. హుస్నాబాద్‌లో గత ఐదు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా అత్యధికంగా 304.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన వేలాది క్వింటాళ్ల ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. కొందరు రైతుల ధాన్యం కుప్పలు నామారూపాలు లేకుండా పోయాయి. పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కేడిక తారవ్వకు చెందిన దాదాపు ట్రాక్టర్ 10 ట్రిప్పుల (150 క్వింటాళ్లు) ధాన్యం డ్రైనేజీలో కొట్టుకుపోవడంతో, ఆమె కలెక్టర్ కాళ్లపై పడి బోరున విలపించారు. అలాగే, జిల్లెలగడ్డకు చెందిన మహిళా రైతు లావుడ్య నీల ఆరు ఎకరాల పంట కూడా నీటిపాలైంది. పట్టణంలోని ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. దుస్తులు, ఎరువుల, కిరాణా దుకాణాల్లోకి వరదనీరు చేరి వస్తువులు తడిసిముద్దయ్యాయి. ఎరువుల వ్యాపారి ఓరుగంటి వెంకటరెడ్డికి చెందిన 400 యూరియా బస్తాలు తడిసి, సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లింది. హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్), జిల్లెలగడ్డ, మీర్జాపూర్, మహ్మదాపూర్ సహా పలు గ్రామాలలో వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటమునిగి నేలకొరిగాయి.



నాగారంలో వరద నీటిలో మునిగిన వరి పంట



కోహెడ మండలంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

మహ్మదాపూర్‌లో సంగ కొంరయ్య ఇల్లు దెబ్బతింది. జిల్లెలగడ్డలో లావుడ్య నర్సింహకు చెందిన 4 పాడి ఆవులు వరదలో గల్లంతయ్యాయి. అందులో రెండు మృతి చెందాయి. జిల్లెలగడ్డ నుంచి మీర్జాపూర్ వెళ్లే రహదారికి గండిపడటంతో పాటు, హుస్నాబాద్-గాంధీనగర్, మహ్మదాపూర్-ఉమ్మాపూర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.ఎల్లమ్మ చెరువు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉధృతంగా మత్తడి దూకడంతో హుస్నాబాద్ నుంచి మాలపల్లి, బొడిగపల్లి, గౌరవెల్లి, రామవరం వైపు రాకపోకలు ఆగిపోయాయి.

మంత్రి ఆదేశాలతో కొనుగోళ్లు

కలెక్టర్ హైమావతి, గురువారం హుస్నాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని, నష్టాన్ని పరిశీలించారు. నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వగా, రైతులు తడిసిన ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆమె కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించారు.

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షంతో కొట్టుకుపోయిన ధాన్యాన్ని మంత్రి పొన్నం పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఓదార్చుతూ మేమున్నామంటూ భరోసా కల్పించారు. పండించిన పంట మొత్తం వరదనీటిలో కొట్టుకుపోయిన తారవ్వ అనే మహిళా రైతుకు తక్షణ సహాయం కింద రూ. 10 వేల అందించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధాన్యాన్ని వేగంగా కొనుగోలు

మిగతా 8వ పేజీలో



చేర్యాల పట్టణంలోని గడిమైసమ్మ కాలనీలోని ఇళ్లలోని చేరిన వరదనీరు



జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి గుండా ప్రవహిస్తున్న వరదనీరు

జలదిగ్బంధంలో చేర్యాల పట్టణం

చేర్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు చేర్యాల పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకుంది. పెద్దచెరువు నిండి మత్తడి దూకడంతో, ఆ ప్రవాహం అసంపూర్తి కాలువ గుండా ప్రవహించి 7వ వార్డులోని యాదవనగర్, శుభోదయనగర్, గడిమైసమ్మ వీధి సహా పలు కాలనీల్లో చేరింది. జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇక చేర్యాల మండలంలో సుమారు 200 ఎకరాల మేర వరి, 100 ఎకరాల పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఆకునూరులో ధాన్యం కొట్టుకుపోయింది. మొండిచింతల కాలనీకి చెందిన నిమ్మల లక్ష్మి ఇంటి పైకప్పు కూలింది.

నీటి గుంతలో పడి
బాలుడి మృతి

- కొండపాక మండలం బందారంలో విషాదం



కీసర దీక్షిత్(ఫైల్)

కొండపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన కీసర రమేష్, అనిత దంపతుల కుమారుడు కీసర దీక్షిత్(2) గురువారం ఇంటి బయట ఆడుకుంటున్నాడు. వీరి ఇంటి పక్కనే ఉన్న గుంతలు వర్షపు నీటితో నిండి ఉన్నాయి. ఈ క్రమంలో దీక్షిత్ పిల్లలతో బయట ఆడుకుంటూ వెళ్లి ఆ నీటి గుంతలో పడిపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. చివరకు ఇంటి పక్కన గల నీటి గుంతలో పరిశీలించి చూడగా బాలుడి మృతదేహం కనిపించింది. బాలుడి మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

ఆర్ఎంపీ డాక్టర్ పన్నాగం.. మాజీనక్సల్ వీరంగం

- మరో ప్రాక్టిషనర్‌కు బెదిరింపు
- నకిలీ తుపాకీ స్వాధీనం

దుబ్బాక, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ ప్రాక్టిషనర్‌ల మధ్య పోటీ నకిలీ తుపాకులతో బెదిరించే స్థాయికి చేరింది. తన ప్రాక్టిస్‌కి గిరాకీ రావడంలేదనే, అక్కసుతో ఆర్ఎంపీ డాక్టర్‌ను బెదిరించి, గ్రామం నుంచి వెళ్లగొట్టాలనే ప్రయత్నం వికటించి, కటకటాలపాలైన సంఘటన గురువారం దుబ్బాక సర్కిల్ పరిదిలోని రుద్రారం గ్రామంలో వెలుగు చూసింది. గురువారం దుబ్బాక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన ప్రైవేట్ ప్రాక్టిషనర్ (ఆర్ఎంపీ) లక్ష్మీనరసయ్యకు గ్రామంలో ప్రాక్టిస్‌కు గిరాకీ ఉంది. ఆదే గ్రామానికి చెందిన మరో ప్రాక్టిషనర్ నరేందర్‌రెడ్డికి అంతంత మాత్రంగానే రోగులు రావడంతో ఈర్ష పెరిగింది. దీంతో నరేందర్‌రెడ్డి పగపెంచుకుని లక్ష్మీనరసయ్యను గ్రామం



నకిలీ నక్సల్‌లను అదుపులోకి తీసుకుని విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టిన ఏసీపీ రవీందర్‌రెడ్డి, దుబ్బాక సీఐ శ్రీనివాస్

నుంచి ఎలాగైనా వెళ్లగొట్టాలని కుట్రపన్నాడు. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన గతంలో జనశక్తిపార్టీలో పనిచేసిన రుద్రారం గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్లు రంగణమైన నర్సింలు అలియస్ కమలాకర్(48), కాసులాబాద్ గ్రామానికి చెందిన బ్రహ్మం(55) లను కలిసి కుట్ర పన్నారు. వీరికి పరిచయం ఉన్న మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మరో మాజీ నక్సలైట్ మొగిలి బిక్షపతి(46)ని సంప్రదించారు. వీరు రూ.పదివేలకు డీల్ మాట్లాడుకొని, ఆర్ఎంపీ డాక్టర్ లక్ష్మీనరసయ్యను బెదిరించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు మరో మాజీ నక్సల్ బ్రహ్మంతో కలిసి గ్రూపుగా ఏర్పడి, ఒప్పందం ప్రకారం రూ.4వేలు కూడా అడ్వాన్స్‌గా తీసుకున్నారు. తనకు పరిచయం ఉన్న కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో నివాసం ఉంటున్న కుమార్ అనే వ్యక్తి వద్ద పందులను తరిమే రబ్బరు బుల్లెట్ల తుపాకీని తనకు వ్యవసాయ బావి వద్ద అవసరం ఉందని నమ్మించి తీసుకుని వచ్చారు. ఒప్పందం ప్రకారం ఈనెల 28న నిందితులు బ్రహ్మం, బిక్షపతి ఇద్దరు ముఖానికి ముసుగు, హెల్మెట్ ధరించి, ద్విచక్రవాహనం మీద వచ్చి, ఆర్ఎంపీ లక్ష్మీ నరసయ్య ఇంట్లోకి వెళ్లి లక్ష్మీ నర్సయ్యను, అతడి భార్యను తుపాకీతో చంపుతామని బెదిరించారు. ఈ క్రమంలో భయంతో వారిద్దరు అరవడంతో గ్రామస్థులు అరుపులు విని అక్కడికి చేరుకున్నారు. వారికి కూడా తుపాకీ చూపిస్తూ పారిపోయారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ , భూంపల్లి ఎస్ఐ హరికృష్ణ, మిరుదొడ్డి ఎస్ఐ సమతలు చాకచక్యంగా కేసు చేధించినట్లు సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

క్రాప్ బుకింగ్‌లో
మార్పు, చేర్పులకు అవకాశం

- నేడు వివరాలు సేకరించనున్న ఏఈవోలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' దినపత్రిలో గురువారం ప్రచురితమైన "ఎడిట్ ఆప్షన్ కోసం రైతుల ఎదురుచూపులు" కథనంపై వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు గ్రామాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలను సేకరించనున్నారు. ఆయా పంటలను(మొక్కజొన్న, పత్తి) విక్రయించేందుకు క్రాప్ బుకింగ్ అడ్డు వస్తుండడం.. గతంలో నమోదు చేసిన వివరాలు తప్పుగా ఉండడంతో మార్పులు చేసేందుకు ఏఈవోలు ఫీల్డ్ ఎంక్వైరీ చేసి వివరాలను జిల్లా వ్యవసాయాధికారి ద్వారా కమిషనరేట్‌కు పంపించనున్నట్లు తెలిసింది. ఈ వివరాలు వచ్చే బుధవారం వరకు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఝరాసంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని విదుత్‌శాఖ ఏడీఏ రజినీకాంత్ పేర్కొన్నారు. గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఝరాసంగంలో విద్యుత్ సిబ్బందితో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. శాఖాపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు

చదివింది డీఈడీ.. చేసేది దొంగతనాలు

- కానిస్టేబుల్ ఉద్యోగం కోసం రెండుసార్లు ప్రయత్నం
- రాకపోవడంతో టవర్ టెక్నీషియన్‌గా..
- ఆదాయం కోసం చోరీల బాట
- నిందితుడి అరెస్ట్.. రూ. 3.34 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీఈడీ పూర్తి చేసిన ఓ యువకుడు దొంగగా మారాడు. రెండు సార్లు పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష వరకు వెళ్లాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేసి కటకటాల పాలయ్యాడు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ నిందితుడి వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండల పరిధిలోని బూర్గుపల్లి తాండకు చెందిన రామావత్ రమేష్‌కుమార్ డీఈడీ పూర్తి చేసి, పోలీస్ కానిస్టేబుల్ కావాలని ప్రయత్నించాడు. రెండు సార్లు రాత పరీక్ష వరకు వెళ్లాడు. అయితే, ఉద్యోగం రాలేదు. ఈ క్రమంలో ఎయిర్‌టెల్ టవర్స్‌లో టెక్నీషియన్‌గా పని చేసి మానేశాడు. ఈజీమనీకి అలవాటు పడి మెదక్ పట్టణంతోపాటు చుట్టూ పక్కల గల టవర్స్ నుంచి ఆర్‌ఎక్స్‌ను చోరీ చేశాడు. ఎయిర్‌టెల్ విజిలెన్స్ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి.. సీసీ కెమెరాల ఆధారంగా గురువారం నిందితుడిని ఇంటి వద్ద పట్టుకొని అరెస్టు చేసి, విచారించగా.. మరో నాలుగు చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి రూ.3.34 లక్షల సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వెల్లడించారు.

బైక్ దొంగ అరెస్టు..

మెదక్ పట్టణంలోని రాయల్ లాడ్జీ ఎదుట బుధవారం పార్కు చేసిన బైక్‌ను రామాయంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రాములు దొంగలించాడు. గురువారం బైక్ నడుపుకుంటూ పారిపోతుండగా బ్లూకోర్ట్ సిబ్బంది వెంబడించి పట్టుకొని విచారించగా.. రామాయంపేట స్టేషన్ పరిధిలోని రెండు సార్లు బైక్ దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. తాగుడుకు బానిసై దొంగతనాలకు అలవాటు పడినట్లు ఏఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్, ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.





మల్కాపూర్ నర్సరీ , పల్లె ప్రకృతి వనం పరిశీలిస్తున్న ఎంపీడీవో శాలికా

పల్లె ప్రకృతి వనం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం మల్కాపూర్, కోనాయపల్లి (పీటీ) గ్రామాల్లో తూప్రాన్ ఎంపీడీవో శాలికా తేలు గురువారం పర్యటించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు' అంటు పల్లె ప్రకృతి వనం, నర్సరీ నిర్వహణపై కథనం ప్రచురితమైంది. ఆంధ్రజ్యోతి కథనంతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, డంప్ యార్డులు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి పరిశీలన చేస్తానంటూ పేర్కొన్న ఎంపీడీవో శాలికా గురువారం తూప్రాన్ మండలం మల్కాపూర్, కోనాయపల్లి (పీటీ) గ్రామాల్లో పర్యటించారు.

డీజిల్ దొంగతనం కేసులో యువకుల అరెస్టు



పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంలో వెళ్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వివరించారు. వనపర్తి జిల్లాకు చెందిన రాహుల్, కామారెడ్డి, జిల్లాకు చెందిన కురుమ గణేష్, లింగంపేటకు చెందిన తోకల నాగరాజులను విచారించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో వారిని పేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు.

వీరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని, డబ్బులు సరిపోక పోవడంతో ముగ్గురు కలిసి బోరబండకు చెందిన అన్వర్ అనే వ్యక్తితో కలిసి డీజిల్ దొంగతనం చేయడం ప్రారంభించారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసి లారీలలో డీజిల్ దొంగలించి అన్వర్ అనే వ్యక్తికి బోరబండలో అమ్మి, ఆ డబ్బులతో జల్సాలు చేస్తున్నారని వివరించారు. జోగిపేటలో డీజిల్ లారీల నుంచి ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాలో పలు లారీల నుంచి డీజిల్ దొంగలించి అన్వర్‌కు విక్రయించేవారు. పెద్దశంకరంపేట చర్చ్ కాంపౌండ్‌లోని నారాగౌడ్ టిప్పర్ల నుంచి ఆరు డబ్బాలలో 150 లీటర్ల డీజిల్ దొంగలించినట్లు వివరించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు డీజిల్ దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాలుగో నిందితుడు అన్వర్ పరారీలో ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పేట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు లేక ఆత్మహత్య



కందుకూరి నాగరాజు(ఫైల్)

పటాన్‌చెరు/సిద్దిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఒకరు, బ్యాంకులో రుణం చెల్లించలేక మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం తాగడానికి డబ్బులు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం వర్గల్ మండలం మినాజీపేటలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మినాజీపేట గ్రామానికి చెందిన కందుకూరి నాగరాజు (26)కొంత కాలం నుంచి మద్యానికి బానిసై ఎటువంటి పని చేయడం లేదు. ఇంటి వద్దే ఉంటూ మద్యం కోసం తరచూ డబ్బులు ఇవ్వమని తల్లి కిష్టమ్మతో గొడవపడేవాడు. గురువారం ఉదయం రూ. 5000 ఇవ్వమని తల్లి కిష్టమ్మను అడగడంతో తన వద్ద డబ్బులు లేకపోవడంతో డబ్బులు ఇవ్వలేకపోయింది. దాంతో తల్లిపై నాగరాజు గొడవ పడి కొట్టాడు. మధ్యాహ్నం నాగరాజు ఇంట్లో పై స్లాబ్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రుణవాయిదా చెల్లించలేక..

బ్యాంకు నుంచి తీసుకున్న రుణం వాయిదా రెండు నెలలుగా చెల్లించలేక ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. ఇస్నాపూర్ పురపాలక పరిధి చిట్కుల్ గ్రామానికి చెందిన సాయికృష్ణ (26) బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. షాపు పెట్టుకునేందుకు గత ఏడాది సంగారెడ్డిలోని ఐసీఐసీ బ్యాంకులో తన తల్లి లలిత పేరిటతో రూ.13లక్షలు రుణం తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్నాడు. రెండు నెలుగా ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో వాయిదాలు చెల్లించడం లేదు. బ్యాంకు అధికారులు వాయిదాలు చెల్లించాలంటూ ఫోన్‌లు చేసి ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గురువారం మధ్యాహ్నం ఉరి వేసుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పై జరిగింది. ఎస్సై సైఫ్ అలీ, తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన కాషబోయిన పోచయ్య (55) వ్యవసాయంతో పాటు గొర్రెల కాపరిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. గురువారం రాత్రి పోచయ్య వారి బంధువైనా మహిళతో కలిసి స్కూటీపై శనిగరానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులోని గోదాంలో నుంచి ఓ లారీ రాజీవ్ రహదారి పైకి ఎక్కి చౌరస్తా నుంచి మలుపు తిరుగుతుండగా స్కూటీ లారీ పక్క భాగంలో ఢీ కొట్టింది. దీంతో పోచయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ పై వెనకాల కూర్చున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

చెరువులో పడి యువకుడి మృతి

కొండపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కొండపాక మండలం మర్పడగలో గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్పడగ గ్రామానికి చెందిన అందిపురం రమేష్ (32)తల్లి సంవత్సరికం ఉన్నందున దుస్తులు ఉతకడం కోసం చెరువుకు అన్న రమేష్ , వదిన కరుణతోపాటు వెళ్లాడు. చెరువు మెట్ల పైన దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అది గమనించిన ఆయన సోదరుడు ప్రయత్నం చేసినా అప్పటికే చెరువులో మునిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో పౌల్ట్రీ రైతు ..

- సర్వీస్ వైరు సరిచేస్తుండగా ఘటన



రాగుల మోహన్(ఫైల్)

రామయంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్వీస్ వైర్ సరి చేస్తూ షాక్ తగిలి పౌల్ట్రీ రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గురువారం రామాయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాగుల మహేష్(38) ఊరి శివారున ఉన్న తన పౌల్ట్రీ ఫార్మ్ వద్దకు ఈ ఉదయం వెళ్లాడు. అక్కడ కరెంట్ ఆన్ చేయగా సరఫరా కాలేదు. దీంతో సర్వీస్ మీటర్ లోని వైరు తొలగించి సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. ఈ ఘటనను చూసిన అక్కడే ఉన్న పలువురు రామయంపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికి భార్య అనిత తీవీ ఏళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై బాలరాజ్ ఘటనా స్థలాని వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండె పోటుతో సెక్యూరిటీగార్డు మృతి



ఈశ్వరయ్య(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న మంగలి ఈశ్వరయ్య(49) గుండెపోటుతో మృతి చెందాడు. సెకండ్ షిఫ్టు విధుల్లో ఉన్న ఆయన గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఆపరేషన్ థియేటర్ వద్ద కుప్పకూలినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. హుటాహుటిన అత్యవసర విభాగానికి తరలించగా, అప్పటికే ఈశ్వరయ్య మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈశ్వరయ్య సుమారు 20 ఏళ్లుగా ఇదే ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈశ్వరయ్య కంది మండలం జుల్‌కల్ గ్రామానికి చెందిన వారని తోటి సిబ్బంది తెలిపారు.

లేబర్ పాలసీ రద్దు చేసేదాకా పోరాటం ఆగదు

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు


మాట్లాడుతున్న చుక్కా రాములు

గజ్వేల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : లేబర్ పాలసీని రద్దు చేసే దాకా పోరాటం ఆగదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రాణే మద్రాస్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్, ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం శ్రమశక్తి నీతి-2025 పేరుతో నూతన లేబర్ పాలసీని తీసుకువచ్చిందని, దీనిని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కార్మికుల హక్కులకు రక్షణగా ఉండే చట్టాలను బలహీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వేతనాల వ్యవస్థను నిర్వీర్యం చేసి పర్మినెంట్ ఉద్యోగులు లేని వ్యవస్థను తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. పరిశ్రమలలో అవకతవకలపై, కార్మికుల భద్రతపై అధికారుల తనిఖీలు లేకుండా యాజమాన్యం ఇష్టారాజ్యంగా నడుపుకునేటట్లు చట్టాలు రూపొందిస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, కార్మిక వర్గాల హక్కుల కోసం సీఐటీయూ ఇప్పటికే పోరాటాలు చేస్తుందన్నారు. డిసెంబరులో మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో కనీస వేతనాల పెంపుదల కోసం పోరాటాలు చేయడానికి ఉద్యమ కార్యాచరణను నిర్ణయించనున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నాసగోని వేణుగోపాల్, నాయకులు బండ్ల స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, రంగారెడ్డి, సాజిద్, రాజగోపాల్ తదితరులున్నారు.

వివాహ వేడుకలో త్రిపుర గవర్నర్


వధూవరులతో గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని జరిగిన ఓ వివాహానికి హాజరయ్యారు. పట్టణానికి చెందిన శివాని వివాహ రోహిత్‌తో జరుగగా ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



ప్రమాదకర ప్లాట్‌ఫాం.. కరువైన వసతులు

ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువై, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్రాడ్‌గేజ్ మార్గం నిర్మాణ సమయంలో ప్లాట్‌ఫాం పొడవు పెంచినప్పటికీ, ఎత్తు మాత్రం పెంచలేదు. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు రైలు ఎక్కడానికి, దిగడానికి నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా, ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు దెబ్బతిని, వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో బెంచీల వద్ద పాములు, విష పురుగులు సంచరించే అవకాశం ఉండటంతో ప్రయాణికులు కూర్చోవడానికి భయపడుతున్నారు. రైళ్ల రాకపోకల గురించి సమాచారం అందించేందుకు కూడా స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.



వందేళ్ల రైల్వేస్టేషన్‌లో సమస్యల హాల్ట్

నిజాం కాలం నాటి బ్రాహ్మణపల్లి స్టేషన్‌పై నిర్లక్ష్యం

కొత్వాల్ రాజా బహదూర్ వారసులు దానం చేసిన భూమిలో నిర్మాణం

ప్రస్తుతం కూలిపోయే దశలో భవనం

ప్రయాణికులకు అందుబాటులో లేని కనీస వసతులు


పైకప్పు పెంకులు ఊడిపోయిన స్టేషన్

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇదో వందేళ్ల చరిత్ర కలిగిన రైల్వేస్టేషన్. నిజాంకాలంలో సరకుల రవాణా చేసేందుకు రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి స్థలం దానం చేసి చొరవ చూపడంతో స్టేషన్‌ను సైతం నిర్మించారు. అంతటి చరిత్ర కలిగిన రైల్వేస్టేషన్ ప్రస్తుతం నిరాదరణకు గురవుతోంది. అభివృద్ధికి నోచుకోక కూలిపోయే స్థితికి చేరకున్నది. ఇదే మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్.

1925లో బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ ఏర్పాటు

తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లిలో నిజాం కాలంలో 1925లో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ రైల్వేస్టేషన్ ఏర్పాటులో కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామారెడ్డి వారసుల కృషి ప్రధానమైంది. వెంకటరామారెడ్డి కుమారుడు హైకోర్టు న్యాయమూర్తి వెంకట లక్ష్మారెడ్డి 1.10 ఎకరాల భూమిని రైల్వేశాఖకు ఇవ్వడంతోనే ఈ బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ నిర్మాణం సాధ్యమైంది. తొలుత గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగేవి. సికింద్రాబాద్ నుంచి నాందేడ్ (మహారాష్ట్ర)కు సరకుల రవాణ కొనసాగేది. ప్రధానంగా ఉప్పు రవాణా ఎక్కువగా జరిగేది. బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో ఉప్పు దిగుమతి కాగానే సంగారెడ్డి, జహీరాబాద్, గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు రవాణా చేసేవారు. కాలక్రమేణ ఈ రైల్వేలైన్ ప్రజల రవాణా సౌకర్యంగా ఉపయోగంలోకి వచ్చింది. రైళ్ల నిలపడంలో వెంకట లక్ష్మారెడ్డి, ఆయన కుమారుడు కెప్టెన్ బారిష్టర్ మాజీ సర్పంచు కిష్టారెడ్డి కృషి చేశారు. బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో లాంతర్లతో విధులు నిర్వహించారు. 1975 డిసెంబర్ 5న స్టేషన్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించారు. అప్పటి ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసన్ ఎలక్ట్రిక్ పనులను ప్రారంభించారు.

నిలిచిన అభివృద్ధి.. తగ్గిన రైళ్లు

కాలక్రమేణా ఈ చారిత్రక రైల్వే స్టేషన్ అధికారుల నిరాదరణకు గురైంది. స్టేషన్ భవనం సరైన నిర్వహణ లేక పెంకులు ఊడిపోయి, గోడలు శిథిలమై ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరుకుంది. ఈ రైల్వేస్టేషన్ సంగారెడ్డి - గజ్వేల్ మార్గంలోని పలు గ్రామాలకు అనుకూలంగా ఉండటంతో చాలా మంది వినియోగించుకున్నారు. రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందుతూ రైళ్ల నిలుపుదల పెరుగుతున్న ఈ కాలంలో, బ్రాహ్మణపల్లిలో మాత్రం రైళ్ల సంఖ్య తగ్గిపోవడం విచారకరం. గతంలో ఇక్కడ ఆగిన పర్భణి ఎక్స్‌ప్రెస్ వంటి కీలక రైళ్ల నిలుపుదలను సైతం రద్దు చేశారు. ప్రస్తుతం రోజుకు కేవలం ఆరు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఇక్కడ ఆగుతున్నాయి.

తక్షణమే అభివృద్ధి చేయాలి

తూప్రాన్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో, 161ఏఏ జాతీయ రహదారికి పక్కనే ఉన్న బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌ను వెంటనే బాగు చేయాలని స్థానికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. స్టేషన్ భవనానికి మరమ్మతులు చేసి, ప్లాట్‌ఫాం ఎత్తు పెంచాలని కోరుతున్నారు. మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆగేలా, ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చారిత్రక స్టేషన్‌ను పునరుద్ధరించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉందని వారు పేర్కొంటున్నారు.

దేదీప్యమానం

నాచగిరి, కొమురవెల్లి క్షేత్రాల్లో కార్తీక దీపారాధన


నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వెలిగించిన దీపాలు

వర్గల్/కొమురవెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ క్షేత్రాలైన కొమురవెల్లి మల్లన్న, వర్గల్ మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధనను నిర్వహించారు. నాచగిరిలో నిత్య దీపోత్సవంలో భాగంగా ఆలయ మండపంలో భక్తులు వివిధ ఆకృతులతో ఏర్పాటు చేసిన ప్రమిదలలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు పర్యవేక్షణలో నిత్య దీపారాధన కార్యక్రమం కొనసాగుతున్నది. కార్తీక శుద్ధ నవమిని పురస్కరించుకుని కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహామండపంలో 9వ రోజు శ్రీరుద్ర పారాయణ స్తోత్రం నిర్వహించారు. అంతతనంర మహిళలకు ప్రమిదలు, నూనె అందించి దీపాలను వెలిగించారు. దీపాల కాంతిలో మహామండపం శోభాయమానంగా వెలుగొందిండి.


కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని మహామండపంలో దీపాల కాంతిలో చేస్తున్న పూజలు

అన్నదాతకు అన్నీ కష్టాలే!

మొదట అనావృష్టి, మధ్యలో అతివృష్టి... చివరికి 'మొంథా' పిడుగు!

చేతికొచ్చిన పంటపై తుఫాన్ ప్రభావం

మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సిన దుస్థితి

కొనుగోళ్లకు అడ్డంకిగా తేమ శాతం

గజ్వేల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి ఈ వానాకాలం సీజన్ ఏమాత్రం కలసి రాలేదు. ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ సమస్యలు ఒకదాని వెంట ఒకటి వెంటాడుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. మొదట్లో దాదాపు నెల రోజుల పాటు వర్షాలు లేక అనావృష్టి భయం వెంటాడింది. ఆ తర్వాత ఏకబిగిన రెండు నెలల పాటు కురిసిన భారీ వర్షాలకు (అతివృష్టి) చేలలో కలుపు తీయలేని పరిస్థితి ఏర్పడింది. తీరా పంట చేతికి వచ్చిన ఈ సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో మరోసారి పంటలపై పిడుగు పడినట్లయింది.

తుఫాన్ దెబ్బ.. పత్తి, వరి, మక్కలకు నష్టం

తాజా వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేలలో ఉన్న పత్తి నల్లబారిపోగా, కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నలు మొలకెత్తాయి. జిల్లాలో అత్యధికంగా 3.40 లక్షల ఎకరాల్లో సాగైన వరి పంట కోత దశకు చేరుకున్నది. చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాల కారణంగా కొన్ని చోట్ల పంట నేలకు ఒరిగింది. ఈ తుఫాన్ ప్రభావం జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, నంగునూరు, చిన్నకోడూరు, కొమురవెల్లి మండలాలపై భారీగా పడింది. ఈ ఏడాది జిల్లాలో సాధారణ వర్షపాతం 698.5 మిల్లీమీటర్లు కాగా, ఏకంగా 1105.7 మిల్లీమీటర్లు నమోదైంది.

మద్దతు ధర కన్నా తక్కువకే విక్రయం

పంట నష్టంతో పాటు మార్కెట్‌లో ధరలు పడిపోవడం


గజ్వేల్ మండలం సింగాటంలో నేలకొరిగిన వరి పంట

రైతులను మరింత కుంగదీస్తోంది. పత్తికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.8,110 కాగా, బహిరంగ మార్కెట్‌లో కేవలం రూ.7 వేలు దాటడం లేదు. దీంతో రైతు క్వింటాలుపై దాదాపు రూ.1200 వరకు నష్టపోతున్నాడు. మక్కలకు మద్దతు ధర రూ.2,400 ఉండగా, మార్కెట్‌లో రూ.1,900 మాత్రమే పలుకుతోంది. ఫలితంగా క్వింటాలుకు రూ.500 నుంచి రూ.600 వరకు నష్టం వాటిల్లుతోంది. గతంలో కురిసిన వర్షాలకు పంట ఉత్పత్తుల నాణ్యత తగ్గి, రంగు మారడంతో పాటు, చేలలోనే మొలకెత్తడంతో ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తేమ సమస్య

రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను, కేంద్రం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, తేమ శాతం కొనుగోళ్లకు ప్రధాన అడ్డంకిగా మారింది. తేమ శాతం 20 శాతం ఉన్నా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినా ఇప్పటి వరకు స్పందన లేదు. దీంతో పంటలను అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు, పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాలని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయ అధికారి వసంతరావు జాగ్రత్తలను వివరించారు.

- పొలంలో నుంచి మురుగు నీటిని తీసివేయడానికి కాలువలు చేసుకోవాలి.
- వానలు పడుతున్న సమయంలో మందులను పిచికారీ చేయడం, ఎరువులు వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి.
- రైతులు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి. చెట్ల కింద నిలబడరాదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదు.
- తాత్కాలికంగా పంట కోతలను వాయిదా వేసుకోవాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచుకోవాలి.
- అలుగు పారుతున్న చెరువులలో మట్టి కోతను నివారించడానికి ఇసుక నింపిన సంచులను తాత్కాలిక అడ్డుకట్టలుగా వేసుకోవాలి.
- వేరుశనగ, కుసుమ, శనగ, ఆవాలు మరియు మొక్కజొన్న పంటలను నవంబరు 15వ తేదీ వరకు విత్తుకోవచ్చు.


తొగుట మండలం ఘనపూర్‌లో వర్షానికి తడిసిన మొక్కజొన్నలు

ఇంకెప్పుడు కొంటారు

తొగుట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టగా, 412 కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించింది. అందులో 92 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. 7,021 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు. మిగతా చోట్ల తేమ శాతం రావడం లేదని సాకుతో ఇంకా తూకం వేయడం ప్రారంభించలేదు. దీంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3.40 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేయగా, 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికే చాలా మంది రైతులు పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చారు. మిగతా పంట ఇంకా పొలాల్లోనే ఉండటంతో రైతులు మధనపడుతున్నారు. చాలా చోట్ల తుఫాన్ ప్రభావంతో పంట నేలవాలగా, రైతులు లబోదిబమంటున్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 9 చోట్ల మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ చాలాచోట్ల తూకం వేయకపోవడంతో అకాల వర్షానికి తడిసి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి ఘటనలో కేసు ఎందుకు నమోదు చేయలేదు?

● పోలీసు వ్యవస్థకు కనిపించడం లేదా?

● నవంబర్ 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ

● ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడి జరిగితే ఇంకా కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో కేసులను సుమోటోగా స్వీకరిస్తున్న పోలీసు వ్యవస్థకు చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మానవ హక్కుల కమిషన్ ఎందుకు మౌనం వహిస్తుందన్నారు. కోర్టులో దాడి జరిగినా కంటెంట్ ఆఫ్ కోర్టు, కోర్టు దిక్కరణ కింద శిక్షలు ఎందుకు పడవని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టీస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జి ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండే వారా అని ప్రశ్నించారు. హర్యానాలో ఒక లాయర్‌కు జడ్జికి వాగ్వాదం జరిగితే జడ్జిని అమర్యాదగా మాట్లాడినందుకే అతనిపై సుమోటో కేసు పెట్టి చర్యలు తీసుకుంటున్నప్పుడు, ఇక్కడ సీజే మీద బూటుతో దాడి చేసినా కూడా కేసులు, అరెస్టులు లేకపోవడం దారుణమన్నారు. గవాయిపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ జాతీయ స్థాయిలో దళితుల ఆత్మగౌరవ పోరాటం చేపడుతున్నామని అన్నారు. ఈ ఘటన మీద సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి చేత విచారణ జరిపించి, దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని కోరారు. ఈ విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 1న లక్షలాది మందితో చలో హైదరాబాద్ పేరుతో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామని మందకృష్ణ మాదిగ తెలిపారు. ర్యాలీకిరాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలోఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి రామారావు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ, నాయకులు రాజు, పెద్దగీత మాదిగ, అబ్రాహం మాదిగ, దేవరంపల్లి అశోక్, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు కృష్ణాపూర్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

కల్హేర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కృష్ణాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.హర్షిత అండర్-19 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుధాకర్, పీఈటీ రాములుయాదవ్ గురువారం తెలిపారు. నారాయణఖేడ్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి హర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. హర్షిత, పీఈటీని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.


జియాలజిస్ట్‌గా యూపీఎస్సీ ర్యాంకర్

జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం పట్టిపల్లి గ్రామానికి చెందిన తప్పెట్ల సంధ్య హైడ్రో జియాలజిస్టుగా ఎంపికైంది. బుధవారం సాయంత్రం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో 29వ ర్యాంకు సాధించింది. హైడ్రో జియాలజిస్టుగా ఉద్యోగానికి ఎంపికైంది. తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సింగూరు మూడు గేట్లు ఎత్తివేత

● ఇన్ ఫ్లో 21,935... అవుట్‌ఫ్లో 26,313 క్యూసెక్కులు

పుల్‌కల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తూఫాన్ ఎఫెక్ట్‌తో కురిసిన వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. బుధవారం వరద నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు 14వ క్రస్ట్‌గేట్‌ను ఎత్తగా, గురువారం ఉదయం నాటికి వరద మరింతగా పెరిగింది. దీంతో 12, 15వ క్రస్ట్‌గేట్లను మీటరున్నర ఎత్తారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 21,935 క్యూసెక్కులు నమోదయింది. ప్రస్తుతం 14వ క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు, 12, 15వ క్రస్ట్‌గేట్లను మీటరున్నర ఎత్తారు. మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా 23,918 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,395 క్యూసెక్కులు వరదను దిగువన ఉన్న మంజీర జలాశయానికి వదులుతున్నారు. మొత్తం అవుట్‌ఫ్లో 26,313 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 520.675 మీటర్లకు 17.133 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.


ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి

చెకుముకి టెస్ట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చెకుముకి సైన్స్ సంబురాలు-2025 వాల్‌పోస్టర్‌ను గురువారం కలెక్టర్ హైమావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని అన్నారు. అలాగే కమిషనర్ కార్యాలయంలోనూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలన ఎంతో అవసరమని అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలనకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని, వారికి ఎల్లవ్పుడూ పోలీసుల సహకారం ఉంటుందని అన్నారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో నవంబర్ 7న , మండల స్థాయి నవంబర్ 21న, జిల్లా స్థాయి నవంబర్ 28న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు అదేవిధంగా రాష్ట్ర స్థాయి పరీక్షలు ఈసారి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించబడతాయని జన విజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు.

ధాన్యాన్ని తక్షణమే తూకం వేయాలి


చెల్కలపల్లిలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వరి, మొక్కజొన్నను వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చిన్నకోడూరు మండలం చెల్కలపల్లిలో అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో తడిసిన వరి ధాన్యాన్ని గురువారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతోనే రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనక రాజు, బీఆర్ఎస్ నాయకులు ఉమేష్ చంద్ర, జంగిటి శ్రీనివాస్, ఎల్లయ్య, బాబు, కార్తీక్ రెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజం

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ, బదిలీలు సహజమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరానగర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వంగల పద్మావతి పదవీ విరమణ పొందగా, గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవోస్ భవనంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రంలోనే గుర్తింపు పొందాయన్నారు. ప్రైమరీలో కూడా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులుండటం సంతోషదాయకమన్నారు. అలాంటి పేరున్న పాఠశాలలో పద్మావతి సుదీర్ఘ కాలం సేవలందించారన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో రాజప్రభాకర్ రెడ్డి, చిన్నకోడూరు ఎంఈవో యాదవరెడ్డి, ఎస్టీయూ ప్రెసిడెంట్ శ్రీధర్, మండల అధ్యక్షుడు, కార్యదర్శి ఫసియొద్దిన్ , అధ్యాపక బృందం శ్రీలత, సుజాత, ఉదయరాణి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చిన్నకోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను తహసీల్దారు సలీం మియా, ఏవో జయంత్ కుమార్ పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 213 ఎకరాల్లో వరి, 12 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బ తిన్నట్లు ఏవో తెలిపారు.


పెద్దకోడూరులో వరిని పరిశీలిస్తున్న ఏవో

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

● మద్దూరు మండల వైద్యాధికారి సీహెచ్ మహేందర్

ఫటాపట్


సీహెచ్ మహేందర్

మద్దూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని 4 సబ్‌సెంటర్ల ఆధ్వర్యంలో మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి మహేందర్ తెలిపారు. పేషెంట్లు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో వైద్యాధికారి ఎలు విషయాలను తెలియజేశారు.

ప్రశ్న: పీహెచ్‌సీ పరిధిలో ఎన్ని సబ్‌సెంటర్లు ఉన్నాయి? ఎంతమంది జనాభా ఉన్నారు?

జ: పీహెచ్‌సీ పరిధిలో మద్దూరు, అర్జున్ పట్ల, దూళిమిట్ట, గాగిళ్లాపూర్ సబ్ సెంటర్లు ఉన్నాయి. ఈ సబ్ సెంటర్ల పరిధిలో 14,463 మంది జనాభా ఉంది.

ప్రశ్న: బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, గుండె జబ్బుల పేషెంట్లు ఎంతమంది ఉన్నారు?

జ: పీహెచ్‌సీ పరిధిలో బీపీ ఉన్నవారు 978, షుగర్ ఉన్న వారు 551, ఈ రెండూ ఉన్నవారు 258 మంది ఉన్నారు. క్యాన్సర్ పేషెంట్లు 14 మంది, గుండె జబ్బులున్న వారు 66 మంది, టీబీ పేషెంట్లు 17 మంది ఉన్నారు. 10 మంది టీబీ పేషెంట్లకు ట్రీట్‌మెంట్ పూర్తికాగా వారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. మిగతా వారందరికీ ట్రీట్‌మెంట్ కొనసాగుతుంది. 30 ఏళ్లు పైబడిన వారు తీవ్ర ఒత్తిడి, మానసిక ఆందోళన, ఆయిల్ ఫుడ్, కొవ్వు పదార్థాలు, స్మోకింగ్, మద్యం సేవిస్తూ శారీరక శ్రమ లేకుండా పోవడంతో బీపీ, షుగర్ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

ప్రశ్న: కిడ్నీ జబ్బులు రావడానికి కారణాలు?

జ: చాలా మంది ఒళ్లు నొప్పులతో గ్రామాల్లోని ప్రైవేటు వైద్యుల వద్దకు వెళుతుండడంతో ఎక్కువగా పెయిన్ కిల్లర్, యాంటీబయాటిక్ ట్యాబ్లెట్లు ఇస్తుంటారు. ప్రతి చిన్న వ్యాధికి తాత్కాలికంగా ఉపశమనం కల్గించే ఎక్కువ మోతాదుకు మించి మందులు అందిస్తున్నారు. దీని వల్ల కిడ్నీ, లివర్‌పై ఎఫెక్ట్ పడుతుంది. వైద్యుల సలహా మేరకు వ్యాధి తీవ్రతను బట్టి అందించే కోర్సును పాటించాలి.

ప్రశ్న: ఏఎన్‌సీలకు మీరిచ్చే సలహాలు?

జ: ప్రభుత్వ పీహెచ్‌సీల్లో అందించే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి. అధికారుల సూచన మేరకు ప్రతి నెల 20 మంది ఏఎన్‌సీ టార్గెట్ ఉంది. ఆశాలు సమర్థవంతంగా పని చేస్తున్నారు. కొంత మంది కొత్త జంటలు నెల తప్పిన విషయాలను బహిర్గతం చేయడం లేదు. దీని వల్ల పుట్టబోయే బిడ్డ జన్యు లోపంతో జన్మించే అవకాశం ఉంది. గర్భవతిగా తెలియగానే ఫోలిక్ యాసిడ్ మాత్రలతో పాటు సరైన పోషకాహారం, సమయానుకూలంగా వైద్యుల సూచనలు పాటించాలి.

ప్రశ్న: హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారా?

జ: పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం.

కొమురవెల్లిలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు


కిరాణషాపులో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొమురవెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండల కేంద్రంలోని కిరాణ, పాన్ దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగా నార్కోటిక్ డాగ్స్‌తో స్థానిక ఎస్సై రాజుగౌడ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ జోలికి పోయి ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. ఏవరైనా మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం


కోటిలింగేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాల్లో విశేషపూజలు నిర్వహిస్తున్నారు. గురువారం సిద్దిపేటలోని ఉమాపార్థివ కోటిలింగేశ్వరాలయంలో మహిళ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా సైక్లిస్ట్‌లు ఎంపిక

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి రోడ్ రేస్ సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన 31 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. నవంబరు 1, 2న యాదాద్రి భువనగిరి జిల్లాలో పోటీలు ఉంటాయని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకట నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పరామర్శ


మాజీ మంత్రి హరీశ్‌రావును పరామర్శిస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావును డీబీఎఫ్ నాయకులు పరామర్శించారు. ఇటీవల హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ రావు మృతిచెందడంతో గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి హరీశ్‌రావు తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, శ్రీరాములు, రాజు, రాంచంద్రం, ఈశ్వర్ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల మోడల్ స్కూల్‌లో పొలిటికల్ సైన్స్ బోధనకు గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె. భిక్షం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంటల ప్రాతిపదికన బోధన నిమిత్తం నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పదిమందికి జరిమానా

చేర్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ కేసులో పదిమంది పట్టుబడ్డారు. వారిని పోలీసులు గురువారం చేర్యాల కోర్టులో జడ్జి తరుణి ఎదుట హాజరుపరచారు. విచారణ చేపట్టిన జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1లక్ష జరిమానా విధించినట్లు సీఐశ్రీను తెలిపారు.

కొమురవెల్లి మీదుగా బస్సులు నడపండి

కొమురవెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కొమురవెల్లి, కొండ పోచమ్మ మార్గంలో ప్రజ్ఞాపూర్ మీదుగా హైదరాబాద్ వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ కోరారు. ఈ మేరకు గురువారం హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్నకు వినతిపత్రం అందించారు. త్వరలోనే రూటును పరిశీలించి బస్సులు నడిచే విధంగా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను తొలగించాలని వినతి

చేర్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కపాస్ కిసాన్ యాప్‌ను తొలగించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం చేర్యాల తహసీల్దారు దిలీప్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ పత్తి విక్రయించాలంటే కపాస్ కిసాన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని నిబంధన పెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మాదిరిగా పాస్‌బుక్ ఆధారంగా పత్తి కొనుగోలు చేపట్టాలని, తేమ శాతాన్ని 20 వరకు పెంచి కొనుగోళ్లు ముమ్మరం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సిరెడ్డి, ఆంజనేయులు, నర్సింహులు, నర్సిరెడ్డి, నారాయణ, నరేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి

కొండపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నరసయ్య డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఎంఈవో కార్యాలయంలో ఎంఐఎస్ సురేందర్‌కు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి వంట చేసి పెడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే గౌరవ వేతనం, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు కోడూరి యాదగిరి, దయ్యాల రేణుక, భాగ్యలక్ష్మి, భూలక్ష్మి, రేణుక, గజ్వేల్ లక్ష్మి, యశోద తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకొని, ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం అందించాలని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం అన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, మోహన్‌రెడ్డి, బాల కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం ఇవ్వాలి

గజ్వేల్ రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గజ్వేల్ మండల బీజేపీ ఉపాధ్యక్షుడు బినమైన ప్రభాకర్ కోరారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారీ వర్షానికి చేతికొచ్చిన పంటలు మునిగిపోయి రైతులు నష్టపోయారని, ఎకరానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

దౌల్తాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మెదక్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు ఇల్లెందుల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎకరాకు కనీసం రూ.20 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

'బీసీ రిజర్వేషన్ కోసం గళమెత్తుదాం'

గజ్వేల్ రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ కోసం గళమెత్తుదామని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టసభలో బిల్లు ప్రవేశపెట్టి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. నవంబర్ 1న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.


మహ్మదాపూర్‌లో పంటలో ఇసుక మేటలు

హుస్నాబాద్ అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

చేయాలని అధికారులను ఆదేశించడంతో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. రైతులకు బార్‌దాన్ (గోనెసంచులు) కూడా ఇచ్చి కాంటా వేశారు.

హుస్నాబాద్ మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని గురువారం రాత్రి సివిల్ సప్లయ్ (ప్రొక్యూర్‌మెంట్) మేనేజర్ నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లయ్ డిప్యూటీ కమిషనర్ కొండల్‌రావు పరిశీలించారు. కోహెడ మండలం బస్వాపూర్, పోరెడ్డిపల్లి, అక్కన్నపల్లి, ఆరేపల్లి, నాగసముద్రాల గ్రామాల్లో మోయతుమ్మెద వాగు వరదప్రభావంతో నష్టపోయిన ప్రాంతాలను, కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టును మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కరీంనగర్, కోహెడ వెళ్లే ప్రధాన రహదారి ఇందుర్తి వద్ద రేణుక ఎల్లమ్మ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి సీఎంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామ చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఆదుకోవాలి అని అన్నారు. నియోజకవర్గంలో ముగ్గురికి ప్రాణ నష్టం జరిగిందని తెలిపారు. అంతకుముందు హుస్నాబాద్ నుంచి సిద్దిపేట వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు టైర్ పంక్చర్ కావడంతో ప్రయాణికులతో మంత్రి మాట్లాడారు.


హుస్నాబాద్‌లో ఎక్స్‌కవేటర్‌తో ధాన్యం ఎత్తుతున్న దృశ్యం


ఆదుకోవాలని కలెక్టర్‌తో ప్రాధేయపడుతున్న జిల్లెలగడ్డకు చెందిన మహిళా రైతు నీల


హుస్నాబాద్ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న తండ్రికి సహాయ పడుతున్న చిన్నారి


మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

ముంచిన 'మొంథా'

(5వ పేజీ తరువాయి)

నీటిపాలుగా మారిన ధాన్యాన్ని ఎత్తిపోస్తూ, ఆరబెట్టుకుంటున్నారు. తుఫాను కారణంగా కోతకు రాని వేలాది ఎకరాల్లోని వరి పంట నేలకొరిగింది. అక్కన్నపేట, లక్ష్మీదేవిపల్లి, గుర్రాలగొంది, పోతారెడ్డిపేట, తిమక్కపల్లి, బెక్కల్ తండా, నర్సాపూర్, మందపల్లి వంటి పలు గ్రామాలలో వరిపంట తీవ్రంగా దెబ్బతింది. చేతికి అందుతుందని భావించిన పత్తి పంట నీట మునిగిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. జనగామ, పందిళ్ల, మహమాదాపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో పత్తి చేను నష్టపోయింది. సిద్దిపేట మార్కెట్ యార్డుతో పాటు జనగామ, రావురూకుల, రామునిపట్ల, పోతారం(ఎస్), ఆకునూరు, చెల్కలపల్లి, ఇబ్రహీంనగర్ శివారు ఐకేపీ కేంద్రాలలో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం వర్షపు నీటికి పూర్తిగా తడిసిముద్దైంది. కొట్టుకుపోయిన ధాన్యాన్ని తిరిగి ఎత్తి ఆరబెట్టుకునే దారుణ పరిస్థితి నెలకొంది. వరద నీటిలో మునిగిన ధాన్యం కుప్పలు, మామిడి తోటలు కూడా ఉన్నాయి. ఇసుక మేటలు: మహ్మదీపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో పంట పొలాల్లోకి వరద నీటితో ఇసుక మేటలు చేరాయి. భారీ వర్షానికి జిల్లాలోని పలు చెరువులు, వాగులు, చెక్ డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. పొంగిపొర్లుతున్న జలాశయాల వద్దకు వెళ్లవద్దని అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. భారీ వర్షానికి పలు రోడ్లు కోతకు గురయ్యాయి.


చిన్నకోడూర్ : రామునిపట్లలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతూ..


నర్సాపూర్-మందపల్లి మధ్య దెబ్బతిన్న కల్వర్టు


చిన్నకోడూర్‌లో పొంగిపొర్లుతున్న పెద్ద చెరువు


అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో నెలకొరిగిన వరిపంట